క్లుప్తంగా

నగర ప్రజలకు మేయర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

నెహ్రూనగర్: క్రీస్తు చూపిన మార్గంలోనే ప్రతి ఒక్కరూ నడవాలని, ప్రేమ, శాంతి సహనం కలిగి ఉండాలని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు సూచించారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని సోమవారం నగర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

పేద ప్రజల గుండెల్లో సీఎం జగన్ చిరస్మరణీయం



నెహ్రూనగర్: ప్రతి పేదవాడి గుండె చప్పుడు వెనుక జగన్నామ స్మరణ ఉంటుందని, వారి గుండెల్లో ఆయన ఎప్పుడూ చిరస్మరణీయంగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నూరి ఫాతిమా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గం 13వ వార్డు మంత్రి వారి వీధిలో ఆదివారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం స్థానిక కార్పొరేటర్ సంకూరి శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూరి ఫాతిమా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడంలో జగన్‌కు సాటి ఎవరూ రారని తెలిపారు. దేశంలోని ముఖ్యమంత్రులందరికీ ఆయన ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మద్దిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జి. నాగేశ్వరరావు, రమణ కుమార్, హరి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలి

గుంటూరు ఎడ్యుకేషన్: దూరవిద్యతో విద్యావంతులుగా ఎదగాలని ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ పరీక్షల విభాగ డైరెక్టర్ నాగేశ్వరరావు సూచించారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో దూర విద్య టెన్త్ విద్యార్థుల శిక్షణ తరగతుల్ని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, విజ్ఞానాన్ని అభివృద్ధి పరచుకోవాలని ఆయన సూచించారు. పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు శిక్షణ తరగతులు ఎంతో మేలు చేస్తాయని చెప్పారు. ఓపెన్ స్కూల్ పరీక్ష విధానంలో ప్రభుత్వం తెచ్చిన మార్పులతో మెటీరియల్ నేరుగా అభ్యర్థుల ఇళ్లకు పంపించినట్లు తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్రైస్తవుల సామాజిక అభివృద్ధికి కృషి



నెహ్రూనగర్: క్రైస్తవుల సామాజిక, సాంఘిక, రాజకీయ అభివృద్ధికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ పోలే ముత్యం పేర్కొన్నారు. ఆదివారం ఈస్ట్ ప్యారిష్ చర్చి కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నమ్మకంతో తనకు ఇచ్చిన బాధ్యతలకు నూరు శాతం న్యాయం చేస్తానని తెలిపారు. క్రిస్టియన్ల అభ్యున్నతే ధ్యేయంగా పని చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ చక్రధరరావు, కమిటీ చైర్మన్ వి. శ్యామ్ కరుణాకర్, ట్రెజరర్ కె. రవికుమార్, చర్చి కమిటీ, సంఘ సభ్యులు, అడిషనల్ పాస్టర్లు పాల్గొన్నారు.

నేటి 'స్పందన' రద్దు

నెహ్రూ నగర్: క్రిస్మస్ పండుగ సందర్భంగా స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రజలంతా గమనించి, సహకరించగలరని ఆమె కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 18న గుర్తు తెలియని సుమారు 55 ఏళ్ల వ్యక్తి చుట్టుగుంట సెంటర్‌లో అపస్మారకస్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు అతడ్ని జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. ఫొటోలోని వ్యక్తిని గుర్తించిన వారు 86888 31336కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

ఆన్‌లైన్‌లో మోసం

పట్నంబజార్: సెల్‌ఫోన్ తక్కువ ధరకు ఇస్తామంటూ డాక్టర్‌ను మోసం చేసి ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నూహా హాస్పిటల్‌లో డ్యూటీ డాక్టర్‌గా పనిచేసే అశోక్ ఇన్‌స్టాగ్రామ్ చూస్తుండగా ఒక యాప్‌లో తక్కువ ధరకే సెల్‌ఫోన్ ఇస్తామంటూ యాడ్ చూశారు. యాప్ నిర్వాహకుల సూచనల మేరకు రూ.87,000 వారికి చెల్లించారు. ఫోన్ రాకపోగా ఎటువంటి స్పందన లేకపోవడంతో డాక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ ప్యారిష్ చర్చి



విద్యుత్ కాంతులతో డాన్‌బాస్కో చర్చి



విద్యుత్ కాంతులతో నార్త్ ప్యారిష్ చర్చి



పాత బస్టాండ్‌లోని ఈస్ట్ ప్యారిష్ చర్చి



కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్టు చర్చి



విద్యుత్ కాంతులలో కొత్తపేటలోని ట్రినిటీ చర్చి



విద్యుత్ దీపాల అలంకరణతో లూథరన్ (పశ్చిమ గురుమండలం) చర్చి



విద్యుత్‌కాంతులతో పునీత ఆగ్నేసమ్మ దేవాలయం

క్రిస్మస్ ప్రార్థనలకు వేళాయె..

క్రిస్మస్ వేడుకలకు నగరంలోని చర్చిలు ముస్తాబయ్యాయి. సోమవారం ఉదయం నుంచే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కొత్తపేటలోని ప్రసిద్ధ ట్రినిటీ చర్చి, పాత బస్టాండ్‌లోని ఈస్ట్ ప్యారిష్ చర్చి, మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ ప్యారిష్ చర్చి, బ్రాడీపేటలోని నార్త్ ప్యారిష్ చర్చి, కన్నావారితోటలోని తెలుగు బాప్టిస్ట్ చర్చిలు విద్యుత్ కాంతులతో మెరిసిపోతున్నాయి. ఈ చర్చిలు అత్యంత ప్రసిద్ధమవ్వడంతో వేల సంఖ్యలో క్రైస్తవులు ప్రార్థనల కోసం హాజరవుతారు. రద్దీని నియంత్రించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని పాస్టర్లు తెలిపారు.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

దళితుల అభ్యున్నతికి శెట్టి కన్నమరాజ ఎనలేని కృషి



నెహ్రూనగర్: దళితుల అభ్యున్నతికి శెట్టి కన్నమరాజ ఎనలేని కృషి చేశారని చార్వాక యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం డేవిడ్ విలియమ్స్ పేర్కొన్నారు. శెట్టి కన్నమ రాజా 14వ వర్ధంతిని పురస్కరించుకొని లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డేవిడ్ మాట్లాడుతూ నీరుకొండ, చుండూరు, కారంచేడు దురాగతాలలో దళితుల పక్షాన నిలబడి పోరాడిన యోధుడు కన్నమ రాజా అని కొనియాడారు. అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా దళితుల్ని చైతన్యవంతుల్ని చేసి వారిలో సామాజిక చైతన్యం తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బండ్లమూడి స్టాలిన్ బాబు, కైలా జయసుధ, ఎండ్రపాటి సాంబశివరావు, వంకదారి శ్రీనివాసరావు, దాసరి ప్రవీణ్, తెనాలి మనోహర్ పాల్గొన్నారు.

డాక్టర్ వుల్లక్కికి ఘన నివాళి

తెనాలి రూరల్: తెనాలి పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు, మేజర్ కాకుమాను వుళ్ళక్కి వర్ధంతిని తెనాలి ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) తెనాలి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పేద ప్రజలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెనాలి శాఖ అధ్యక్షురాలు డాక్టర్ జె. విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ, వైద్యులు గోగినేని లక్ష్మీప్రసాద్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు నియోజక వర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ కుమార్

గుంటూరు రూరల్(కాకుమాను): విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీల్లో కూడా రాణించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం సాయంత్రం నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి మంగళవారం నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూలులో 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి దేశస్థాయిలో క్రీడల్లో యువకులంతా పాల్గొని రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలనే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలంతా తప్పనిసరిగా పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో ఐదు మండలాల కన్వీనర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

ఆధునిక జీవనశైలితోనే గుండె జబ్బులు



డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ బాధ్యులు

తెనాలి: ఆధునిక జీవనశైలి మనిషి గుండెపై పలు దుష్ప్రభావాలు చూపుతోందని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కారుమూరి శ్రీనివాసరెడ్డి అన్నారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో జరిగిన సభకు క్లబ్ అధ్యక్షుడు గుత్తా వెంకటరత్నం అధ్యక్షత వహించారు. 'గుండె జబ్బులు-కారణాలు' అనే అంశంపై డాక్టర్ శ్రీనివాసరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. భారతదేశంలో దైనందిన జీవనంలో పెరిగిన వేగం, వివిధ వృత్తుల్లోని పోటీతో మానసిక ప్రశాంతత లోపిస్తోందని తెలిపారు. ఆదుర్దా, ఆందోళనలు గుండెపై ప్రభావం చూపుతున్నాయని చెప్పారు. ప్రతిరోజూ వ్యాయామం చేయటం, జీవన శైలిని మార్చుకోవటంతో గుండెజబ్బుల నుంచి నివారణ పొందవచ్చని సూచించారు. క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి తొలుత డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సభకు పరిచయం చేశారు. డాక్టర్ శ్రీనివాసరెడ్డిని సత్కరించారు. కోశాధికారి సీహెచ్ అశోక్‌కుమార్ స్వాగతం పలికారు.

అంకితభావంతో ప్రజాసేవ

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

పెదకాకాని: అంకితభావంతో బజరంగ్ ఫౌండేషన్ ప్రజాసేవను కొనసాగిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజా రంజకమైన పాలనను అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా ఈనెల 17న అగతవరప్పాడులో జరిగిన బజరంగ్ నేత్రజ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు 421 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించినట్లు చెప్పారు. వారందిరకీ ఆదివారం కళ్లజోళ్లు అందించినట్లు ఆయన తెలియజేశారు. 27న తక్కెళ్లపాడులో జగన్నామ సంక్షేమ సంగమం మండలంలోని తక్కెళ్లపాడులో బుధవారం జగన్నామ సంక్షేమ సంగమం పేరిట వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా నేత్రజ్యోతి కంటి పరీక్షలు, వ్యక్తిగత కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమం పేరుతో గుండె పరీక్షలు చేయనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి యాంజియోగ్రామ్, సర్జరీలు, స్టెంట్లు వేసే కార్యక్రమంతో పాటు దివ్యాంగ దర్శిని పేరుతో త్రిచక్ర వాహనాలు, జైపూర్ కాళ్లు, వెస్ట్రన్ కమోడ్లు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఫిజియోథెరపీ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు. జగన్నామ సంక్షేమ సంగమం పేరుతో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



అగతవరప్పాడులో నేత్రజ్యోతి వైద్య శిబిరం ద్వారా కళ్లజోళ్లు అందుకున్న గ్రామస్తులతో బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

డాక్టర్ శ్రీనివాసరెడ్డికి బంగారు పతకం

తెనాలి రూరల్: డాక్టర్ మేజర్ కాకుమాను వుళ్లక్కి స్మారక బంగారు పతకాన్ని డాక్టర్ కారుమూరు శ్రీనివాసరెడ్డికి ప్రదానం చేశారు. బోస్ రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ కార్యాలయంలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం గుండె జబ్బుల కారణాలను డాక్టర్ శ్రీనివాసరెడ్డి వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ఐఎంఏ తెనాలి శాఖ బాధ్యులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ పావని ప్రియాంక, డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ కె. శ్యామ్ ప్రసాద్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ టి. మస్తానమ్మ, డాక్టర్ జగదీశ్వరి, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ కామినేని రమేష్, వైద్యులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో పాఠశాల విద్య నిర్వీర్యమైందని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాద రావు పేర్కొన్నారు. కలెక్టరేట్ వద్ద ఉన్న రెవెన్యూ భవన్‌లో ఆదివారం సంఘ జిల్లా అధ్యక్షుడు కె.బసవలింగారావు అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పాండురంగ వరప్రసాదరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగంపై వ్యవహరిస్తున్న తీరుకు వ్యతిరేకంగా పెద్దఎత్తున ప్రజలతో కలసి ఉపాధ్యాయులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు షేక్ జిలాని, కె.బసవలింగారావు మాట్లాడారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా, మాజీ ఉపాధ్యక్షుడు వై. నేతాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం డీ. ఖాలీద్, పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్మాన్, మక్కెన శ్రీనివాసరావు, జిల్లా కమిటీ సభ్యులు పి.నాగశివన్నారాయణ, జనార్దన్, లక్ష్మణ్, మూర్తి, శ్రీనివాస్, రామలీల, దాస్, పార్వతి, జిల్లా కౌన్సిలర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర త్రో బాల్ జట్టుకు తక్కెళ్లపాడు విద్యార్థిని ఎంపిక



పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సొపాటి నందిని జిల్లాస్థాయి త్రోబాల్ పోటీల్లో ప్రతిభ కనపరచి రాష్ట్ర జట్టుకు ఎంపికైంది. ఆమె ప్రస్తుతం శిక్షణలో ఉంది. డిసెంబరు 26 నుంచి తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయ స్థాయి జూనియర్ త్రోబాల్ బాలికల పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ఆమెను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి.ఎం. శ్రీనివాసరెడ్డి, వ్యాయామోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమాజంలో వివాహ వ్యవస్థ ఎంతో కీలకం



వధూవరుల పరిచయ వేదిక నిర్వాహకులతో డాక్టర్ ఉమాజ్యోతి

గుంటూరు ఎడ్యుకేషన్: సమాజంలో వివాహ వ్యవస్థకు ఎంతో గౌరవ ప్రదమైన స్థానముందని, కుటుంబాల మధ్య బాంధవ్యాలను నెలకొల్పడంలో అది ఎంతో కీలకమని గుంటూరు వైద్య కళాశాల సైకాలజీ విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో ఆదివారం ఆర్యవైశ్య అఫీషియల్స్-ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆర్య వైశ్య వధూవరుల వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉమాజ్యోతి వివాహానంతరం ఇరువైపులా తల్లిదండ్రులు పోషించాల్సిన పాత్ర, వధూవరుల మనస్సులపై కుటుంబ సభ్యుల ప్రవర్తనకు సంబంధించిన అంశాల్ని వివరించారు. ఆధ్యాత్మిక ప్రవచనకర్త కె.వి.కోటేశ్వర రావు మాట్లాడుతూ వివాహ వ్యవస్థలో వేద మంత్రోచ్చారణకు గల ప్రాముఖ్యత, జీలకర్ర-బెల్లం ప్రాధాన్యతను వివరించారు. జిల్లా పరిశ్రమల అధికారి ఎస్. మదన్‌మోహన్ శెట్టి మాట్లాడుతూ వధూవరులు కోరికల్ని తగ్గించుకుని, సరైన వయస్సులో వివాహాలు చేసుకోవాలని సూచించారు. అవోపా రాష్ట్ర అధ్యక్షుడు తటవర్తి రాంబాబు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో రాష్ట్రవ్యాప్తంగా 10 ప్రాంతాల్లో వధూవరుల పరిచయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అవోపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.నాగేశ్వరరావు, గుంటూరు శాఖ అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం, కార్యదర్శి రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి సుబ్బారావు, పరిచయ వేదిక కన్వీనర్ శివ సుధాకర్, సాయి రమేష్, మురళీకృష్ణ, వధూవరులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పిల్లలో పెరుగుతున్న మానసిక సమస్యలు

డాక్టర్ కొసరాజు కళాధర్



హాస్పిటల్‌ను ప్రాంభిస్తున్న డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు

గుంటూరు మెడికల్: చిన్నారుల్లో నేడు మానసిక సమస్యలు పెరగడం చాలా బాధాకరమైన విషయమని సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ కొసరాజు కళాధర్ అన్నారు. స్థానిక సాంబశివపేటలో శనివారం పిల్లలు, స్త్రీల కోసం ప్రత్యేకంగా నూతనంగా నిర్మించిన 'పాథ్‌వేస్ సైకాలజీ' మానసిక వైద్యశాలను డాక్టర్ కొసరాజు కళాధర్, డాక్టర్ భువనేశ్వరి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక జీవనశైలి వల్ల నేడు తల్లిదండ్రులు పిల్లలతో చాలా తక్కువ సమయం గడుపుతున్నారని చెప్పారు. పిల్లల చేతులకు ఫోన్లు అప్పగించి సొంత పనుల్లో మునిగి తేలడంతో సరిగా మాటలు పలకలేకపోవడంతో పాటు పలు రకాల మానసిక సమస్యల బారినపడుతున్నారని వెల్లడించారు. మానస హాస్పిటల్ అధినేత, మానసిక వైద్యనిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.వి.ఎల్. నరసింహారావు, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఇవటూరి శరత్‌చంద్ర మాట్లాడుతూ నూతనంగా నిర్మించిన పాథ్‌వేస్ సైకాలజీ మానసిక చికిత్సా కేంద్రంలో పిల్లల్లో వచ్చే వివిధ రకాల మానసిక సమస్యల్ని ముందస్తుగానే గుర్తించి చికిత్స అందించే ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పిల్లల చికిత్సలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ శ్రీరమ్య పర్యవేక్షణలో వైద్యసేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. స్త్రీల మానసిక రుగ్మతల కోసం ఉమెన్ వెల్‌నెస్ సెంటర్ కూడా ఉన్నట్లు పేర్కొన్నారు. సీనియర్ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ యస్.వి. రమణారావు, హైదరాబాద్ ఆషా హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ కె. చంద్రశేఖర్, డాక్టర్ జి. ప్రసాదరావు, ఖమ్మంకు చెందిన సైకియాట్రిస్ట్ డాక్టర్ ఆర్. సతీష్ బాబు, డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, డాక్టర్ ఏ. హనుమంతరావు , డాక్టర్ ఏ. శ్రీనివాసరావు పలు వైద్య విభాగాల్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు సీనియర్ వైద్య నిపుణులు పాల్గొని డాక్టర్ శ్రీరమ్యను అభినందించారు.

పంట నష్టం లేకుండానే పరిహారం ఎలా ?

ఆర్బీకే ఉద్యోగిపై టీడీపీ నాయకుల దౌర్జన్యాన్ని ఖండించిన వైఎస్సార్ సీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పొన్నూరు: పంట నష్టం జరగకుండానే పరిహారం నమోదు చేయాలని ఆర్బీకే ఉద్యోగిపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి పాల్పడటాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. మార్కెట్ యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ములకుదురు గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో ఉద్యోగి సుబ్బారావుపై కొందరు టీడీపీ నాయకులు జరగని నష్టానికి కూడా పంట నష్ట పరిహారం కోసం తప్పుడు లెక్కలు రాయాలని దౌర్జన్యానికి పాల్పడ్డారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందుతుందని చెప్పారు. బెదిరించి పరిహారం తీసుకోవాలని ఉద్యోగులపై ఒత్తిడి చేస్తే సహించేది లేదని తెలిపారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు మహమ్మద్, రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆదిశేషులు, పట్టణ జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, మామిళ్లపల్లి సర్పంచ్ జాలాది యానాది రావు, నాయకులు ములుకుదుటి రఘురామ విద్యాసాగర్, గోపిశెట్టి వాసు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మోదుకూరి జాన్సన్

తెనాలి: సుప్రసిద్ధ నాటక, సినీ రచయిత మోదుకూరి జాన్సన్ 35వ వర్ధంతిని ఆదివారం స్థానిక గాంధీ నగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. మోదుకూరి జాన్సన్ కల్చరల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గుంటూరు కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాన్సన్ అభిమానులు పలువురు పాల్గొని, ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. నాటి సామాజిక పరిస్థితులపై ప్రజల్లో చైతన్యం కలిగించే విధంగా జాన్సన్ చేసిన రచనలు నేటికీ ప్రాచుర్యంలో ఉన్నాయని గుంటూరు కృష్ణ చెప్పారు. ఉపాధ్యాయుడు కనపర్తి బెన్‌హర్‌బాబు మాట్లాడుతూ నాటక రంగంలో నిచ్చెన మెట్లు, నటనాలయం, దేవాలయం, సినీ రంగంలో మానవుడు-దానవుడు, డబ్బుకులోకం దాసోహం, కరుణామయుడు సినిమాలు జాన్సన్ రచనా పటిమకు నిదర్శనమన్నారు. సమాజ మార్పును కాంక్షిస్తూ జాన్సన్ రచనలు చేశారన్నారు. గుర్రం జాషువా విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి పినపాటి రవికుమార్, సహజ కవి అయినాల మల్లేశ్వరరావు, సుంకర విశ్వేశ్వరరావు, కేవీఎస్‌వీ ప్రసాద్, కొమ్ము అబ్రహాం లింకన్, చిలకా సుధాకర్‌బాబు, వైఎంసీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, డి.అమర్‌నాథ్, కె.ఆంజనేయులు పాల్గొన్నారు.